క్లుప్తంగా

ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రసూన

సత్యవేడు: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో ఖాళీ ఉన్న ఆరు సీట్లు భర్తీ చేసేందుకు బుధవారం గురుకుల పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. పాఠశాల పరిధిలో నిర్వహించిన పరీక్షకు 104 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆరవ తరగతిలో 2, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 1 సీటు ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహించారు. మూడు గదుల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. చీఫ్ కే.ప్రసూన, వైస్ ప్రిన్సిపల్ వసుంధర పరీక్షలు నిర్వహించారు.

హౌసింగ్ డీఈ కార్యాలయం మార్పు



మాట్లాడుతున్న ఈఈ మోహన్

సత్యవేడు: నాగలాపురంలోని హౌసింగ్ డీఈ కార్యాలయాన్ని సత్యవేడుకు మార్చినట్లు ఈఈ ఎం.మోహన్ తెలిపారు. బుధవారం హౌసింగ్ డీఈ కార్యాలయాన్ని ఈఈ పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణాలపై రివ్యూ నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ మండల పరిధిలోని 19 లేఅవుట్ పరిధిలో 1,504 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికి 647 ఇళ్లు పూర్తి చేశారని, మిగిలిన ఇళ్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రోడ్లు, శాశ్వత నీటి పథకాలు ఏర్పాటు చేయాలన్నారు. 2018, 2019, 2020లలో బిల్లులు అందని వారి వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, ఏఈ వై.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సత్యవేడు: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పారిశుధ్య వారోత్సవాలపై సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలతో ఎంపీడీఓ దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, తహసీల్దార్ రామాంజనేయులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు పూర్తిగా శుభ్రం చేయాలని, రోడ్లపై చెత్త, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నీటి ట్యాంకులు 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. నీటి నమూనాలు పరీక్షించి సరఫరా చేయాలని తెలిపారు. ఎంపీఈఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జూనియర్ రీసెర్చ్ ఫెలోకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో డీఆర్‌డీఓ స్పాన్సర్డ్ ప్రాజెక్ట్ అయిన డెవలప్‌మెంట్ ఆఫ్ నానో ఎన్ క్యాప్సిలేటెస్ నాచురల్ యాంటీ మైక్రోబయాల్స్ ఫర్ ఫుడ్ ప్రిజర్వేషన్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్స్ ప్రొఫెసర్ కళారాణి, ప్రొఫెసర్ ఉమామహేశ్వరి దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను పోస్టు ద్వారా లేదా ఈమెయిల్ ద్వారా పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మాతా-శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు



రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వెంకటగిరి రూరల్ : మాతా శిశుమరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి నాగేంద్ర కుమార్ తెలిపారు. ఆయన గురువారం వైద్యులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చింతగుంటలో మాతా-శిశుమరణాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం మహిళలకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి బేబిరాణి, డీపీహెచ్ఎన్ఓ ఇన్‌చార్జి పి.ప్రకాష్, వైద్యాధికారి శివకృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ సునీల పాల్గొన్నారు.


ప్రాణాలమీదకొచ్చినా..'కరుణ' లేదా!

- కమ్మీలు తేలిన కరుణానది వంతెన స్లాబ్
- పగుళ్లు, గుంతలతో వాహనదారుల ఇబ్బందులు



కరుణానది వంతెన స్లాబ్‌పై గుంతలు





తడ-వరదయ్యపాళెం మార్గంలోని వంతెన, స్లాబ్‌పై పగుళ్లు

వరదయ్యపాళెం: తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డులోని కదూరు సమీపంలోగల కరుణానది వంతెన స్లాబ్ మరమ్మతుల దశకు చేరుకుంది. దీంతో ఆ వంతెనపై ప్రయాణం చేయాలంటే జర భద్రంగా వెళ్లక తప్పదు. వంతెన స్లాబ్ పూర్తిగా పగుళ్లు సంభవించి అక్కడక్కడ పెద్ద గుంతలు ఏర్పడడంతో అటువైపు వెళ్లే వాహనదారులు సంబంధిత గుంతల్లోపడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు, భవనాల శాఖచే 2004లో కరుణానది వంతెనను నిర్మించారు. ప్రధానంగా స్లాబ్ పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో అప్పట్లో ఏ మేరకు నాణ్యతగా నిర్మించారో అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. కనీసం గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం వాహనదారులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. శ్రీసిటీ ప్రాంతాలకు రోజువారీ వందలాది వాహనాలు వంతెన మార్గంలో వెళ్లాల్సి ఉండగా ఇంతటి నిర్లక్ష్యం చూపడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి వంతెనకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ రాంబాబును ప్రశ్నించగా త్వరలోనే వంతెనకు మరమ్మతులు చేసి గుంతలను పూడ్చివేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఏర్పేడు: నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చరణాదీశ్, హేమను గురువారం ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అభినందించారు. 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో అప్పటి 8వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. 4 ఏళ్లపాటు ఒక్కొక్క విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కొక్క ఏడాదికి రూ.12 వేలవంతున నగదును పొందనున్నట్లు వివరించారు. ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటున్నారు. రెండు నెలల పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు.

ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అనివార్యం



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: భారతదేశం బలమైన ఆర్థిక శక్తిగా పురోగతి సాధించాలంటే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు అవలంబించాల్సిన అవసరం చాలా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జరుగుతున్న సీపీఎం శాఖా కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ఆయన హాజరయ్యారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంబానీ, ఆదానీల కోసం విదేశాల నుంచి అనవసర దిగుమతులు తగ్గించాలని, నల్ల ధనాన్ని వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై పరోక్ష పన్నుల మోతను అరికట్టాలని చెప్పారు. ఉపాధి హామీకి నిధుల పెంపు, నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి అయ్యేలా అధికార వికేంద్రీకరణ జరగాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, మనోహర్, వెలివేంద్రం, కుప్పమ్మ, రాజా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి



రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబాలు

సత్యవేడు: ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హస్సర్(35), నీలయ్య(50) రెండు కుటుంబాలకు తక్షణ సాయం అందించి ఆదుకోవాలని పోలీసులను బీసీ కాలనీ వాసులు, మృతుల బంధువులు బుధవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేశారు. పోలీసులు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారకులపై కేసు నమోదు చేశామని, లారీ సీజ్ చేశామన్నారు. ఆందోళనకారులు మాత్రం లారీ యాజమాన్యం నుంచి పరిహారం ఇప్పించాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు.

శ్రీసుందరరాజ స్వామి అవతార మహోత్సవాలు



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణ స్వామివారి ముఖ మండపంలో శ్రీసుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీకృష్ణ స్వామివారి ముఖ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు పెద్దశేష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. శుక్రవారం రాత్రి స్వామివారు హనుమంత వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ ఏఈఓ రమేష్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి పాల్గొన్నారు.


ఘనంగా హజరత్ ఖాదర్‌షావలీ గంధోత్సవం



జెండాలతో ఊరేగింపుగా వస్తున్న నిర్వాహకులు, భక్తులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని హజరత్ ఖాదర్‌షావలీ (చిన్నదర్గా) దర్గా 40వ గంధోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గాను పూలతో అందంగా అలంకరించారు. గడియారం సెంటర్ నుంచి దర్గా వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి దర్గా సమీపంలో ఉన్న నీలిశెట్టి కుటుంబ సభ్యులు, పఠాన్ అమీర్‌ఖాన్ ఇళ్ల నుంచి నిషాన్ జెండాలు తీసుకుని పట్టణంలో ఊరేగించి దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం పట్టణంలోని కాలేషా సాహెబ్ ఇంటి నుంచి ఆయన కుమారులు చాన్‌బాషా, శేఖర్ శ్రీవారి గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథం(గుమ్మటం)పై పెట్టుకుని నగరోత్సవం చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకుని ఫాతేహాలను నిర్వహించారు.

ఇసుక డంపింగ్ పాయింట్ తనిఖీ



ఇసుక డంపింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

నాగలాపురం: మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద నిల్వ ఉన్న ఇసుక డంపింగ్ పాయింట్‌ను నాగలాపురం తహసీల్దార్ తనిఖీ చేశారు. ప్రభుత్వం అనుమతులు జారీ చేసేంత వరకు ఇసుక తరలించడానికి వీలులేదని అక్కడ ఉన్న వీఆర్ఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి నటరాజ్‌ను ఆదేశించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగిస్తామని అన్నారు. ఇసుక డంపింగ్ పాయింట్ వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని నిఘా పెట్టామని తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

ఏర్పేడు: మండలంలోని సరస్వతికండ్రిగ మాజీ సర్పంచ్ అరగుంట్రం చిన్న కన్నయ్య(73) మృతి చెందారు. ఆయన మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. గ్రామస్తులు ఆయనకు నివాళులర్పించారు.

రాహుకేతు పూజల్లో పొన్నూరు ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే దూళిపాల నరేంద్ర కుటుంబసభ్యులతో రాహుకేతు పూజలు చేసుకున్నారు. వాయులింగేశ్వరుని దర్శించుకోవడానికి కుటుంబసభ్యులతో విచ్చేసిన ఆయనకు. ఆలయ మర్యాదలతో అధికారులు వేదపండితులతో స్వాగతం పలికారు. సహస్ర లింగం వద్ద రాహుకేతు పూజలు నిర్వహించుకుని స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయదర్శనం చేసుకున్నారు.

కండలేరులో 6.330 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 6.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

రామచంద్రాపురం: టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్(టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) లక్ష్యమని ఆ సంస్థ సభ్యుడు చిట్టిబాబు అన్నారు. గురువారం మండలంలోని సీరామాపురం కమ్యూనిటీ కేంద్రంలో కాగ్ ఆధ్వర్యంలో టెలికాం కంపెనీల వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 నాటికి గ్రామాల్లోని ప్రతి ఇంటికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కలిగి ఉండే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ప్రతి విద్యార్థి బడిలో ఉండాలి



సత్యవేడు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సత్యవేడు: ప్రతి విద్యార్థి తప్పకుండా బడిలో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-1 ఉషా తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వీటితోపాటు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు, బోధిస్తున్న విద్య, విద్యార్థులకు అందిస్తున్న యూనిఫాం, షూ, పాఠ్యపుస్తకాలు, బెల్ట్, నోట్ పుస్తకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డులలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు డీవీ. రాజు, సుగుణ, వందన, ఢిల్లీరాణి, అపర్ణ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడికి పంపాలి

నాగలాపురం: విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల బాటపట్టి నేను బడికి పోతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పిచ్చాటూరు మండలంలోని రజానగరం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు కలిసి గురువారం నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ కె.హేమామాలిని, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వాసు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడికి పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందని అన్నారు. బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించడమే నేను బడికి పోతా ముఖ్యఉద్దేశం అని తెలిపారు.

పుదుకుప్పంలో 'నానుం పల్లికుడం సెల్‌గిరేన్'

సత్యవేడు: మండలంలోని పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూలు విద్యార్థులు గురువారం 'నానుం పల్లికుడం సెల్లిగిరేన్'(నేను బడికి పోతా) ర్యాలీ నిర్వహించారు. విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ తమిళంలో రాసిన ప్లకార్డులు చేతబట్టి ప్రధానోపాధ్యాయురాలు పి.భారతి ఆధ్వర్యంలో పుదుకుప్పంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయంతి, జగదీష్, ప్రేమ్‌కుమార్, ఏకాంబరం, ఆంటోని, పాండ్యన్, మునిబాల, వ్యాయామోపాధ్యాయురాలు కె.గ్రేస్ ప్రతిమ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



పిచ్చాటూరు మండలంలో..

ఆరూరు, శిరినంబదూర్‌లో ఇంటింటా టీచర్ల వినతి



విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న టీచర్ల బృందం

ర్యాలీ అనంతరం హెచ్‌ఎం నేతృత్వంలో టీచర్ల బృందం శిరినంబదూర్, 30కి.మీ దూరంలోని ఆరూరుకు వెళ్లింది. ఈ గ్రామాల నుంచి ఎక్కువమంది విద్యార్థులు పుదుకుప్పం హైస్కూలుకు అడ్మిషన్ల నిమిత్తం వస్తుంటారు. ఈ నేపథ్యంలో అడ్మిషన్లను పెంచుకునేందుకు ఆ గ్రామాలకు వెళ్లిన హెచ్‌ఎం, టీచర్లు తమ స్కూలులో పిల్లలను చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి వారి తల్లిదండ్రులను కోరారు.



పుదుకుప్పంలో ర్యాలీ చేస్తున్న టీచర్లు, తమిళ విద్యార్థులు

కేవీకేకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి వనస్థలిలోని రాస్ కేవీకేకు భారతీయ వ్యవసాయ సాంకేతిక పరిశోధన, వినియోగసంస్థ నాలుగు విభాగాల్లో ఉత్తమ సేవలను అందించినందుకుగాను ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన జోన్-10 కేవీకేల వార్షిక జోనల్ సమావేశంలో వ్యవసాయ శాస్త్రజ్ఞులు, నిపుణులు, నాలుగు రాష్ట్రాల కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో కరకంబాడికి చెందిన రాస్ కేవీకేకు జిల్లాలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించి రైతులు అవలంబించేలా కృషిచేసినందుకు, నూనె గింజల పంటల్లో రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రదర్శన క్షేత్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉత్తమ వికసిత్ భారత్ సంకల్పయాత్ర విభాగాలలో జిల్లాల్లోని రైతులకు అత్యుత్తమ సేవలను అందించినందుకుగాను ప్రశంసాపత్రాలను అందించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు భారత వ్యవసాయ పరిశోధన, సాంకేతిక మండలి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. దీంతో కేవీకే శాస్త్రవేత్తలను రాస్ జనరల్ సెక్రటరీ వెంకటరత్నం అభినందించారు.

29 నుంచి ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి

తిరుపతి సిటీ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు ఈ నెల 29 నుంచి రెండు రోజులపాటు ఎస్వీ యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి తెలిపారు. గురువారం స్థానిక ఎస్వీయూలో జరిగిన ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని, బడ్జెట్‌లో నిధులు సైతం తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా జాతీయ సమావేశాల్లో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, నాయకులు చిన్ని, జిల్లా అధ్యక్షుడు నవీన్, ప్రవీణ్, నగర అధ్యక్షుడు హరికృష్ణ, వర్సిటీ నాయకులు చంద్ర పాల్గొన్నారు.

పరుగులు తీస్తున్న జిల్లా యంత్రాంగం





కాట్రపల్లెలో పంచాయతీ కొళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, కాట్రపల్లెలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న చేస్తున్న ఎంపీడీఓ రెడ్డెయ్య

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం కాట్రపల్లెలో అతిసారం విజృంభించడంతో ఆ మండలానికి జిల్లా అధికారులు పరుగులు తీస్తున్నారు. ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోని జిల్లా యంత్రాంగం రెండేళ్ల చిన్నారి మృతి చెందితేగానీ వారిలో చలనం రాలేదు. దీంతో రెండు రోజులుగా జిల్లాస్థాయి అధికారులు అక్కడికి చేరుకుని హడావిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీహరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దులేటి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులతో పర్యవేక్షిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు దుకాణాలను తనిఖీ చేశారు. అలాగే కేవీబీపురంలోని ఆరిజెన్ మామిడి గుజ్జు తయారీ కంపెనీని కూడా వారు తనిఖీ చేశారు. ఎస్ఈ విజయ్‌కుమార్ కాట్రపల్లెలోని పంచాయతీ నీటి సరఫరా కొళాయిలు, ట్యాంకులను పరిశీలించి, తక్షణమే పైపులైను లీకేజీలకు మరమ్మతులు చేయాలని, అలాగే గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను డీపీఓ ఆదేశించారు. ఎంపీడీఓ రెడ్డెయ్య, వైద్యాధికారి కుమార్ పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ మధ్యాహ్న భోజన నిర్వహణ, నీటి కొళాయిలను పరిశీలించారు.